# మంథని కి రెగ్యులర్ సిడిపిఓ ను నియమించండి

## – ఇంచార్జ్ సిడిపిఓ తో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు




**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని అంగన్వాడి ప్రాజెక్టు పరిధిలో రెగ్యులర్ సిడిపిఓ లేకపోవడంతో ఇంచార్జి సిడిపిఓ తో ఉద్యోగులతో పాటు అంగన్వాడి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మంథని సిడిపిఓ గా రెగ్యులర్ అధికారిని నియమించే విధంగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇన్చార్జి సిడిపిఓ ఉండడం మూలంగా ప్రాజెక్టు పరిది లోని వివిధ మండలాల్లో సక్రమంగా తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి ఇన్చార్జి సిడిపిఓ గా ఉన్న వ్యక్తి తాను సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్న కమన్పూర్ మండలంలో సైతం సక్రమంగా అంగన్వాడి కేంద్రాలను తనిఖీలు చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇదిలా ఉండగా మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాల్లో ఇటీవల ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు చేయగా అక్కడ కాలం చెల్లిన బాలామృతం తో పాటు పుచ్చిపోయిన పప్పు దినుసులు బయటపడ్డాయి. ఈ విషయం జిల్లా అధికారికి తెలియకుండా స్థానిక ఇన్చార్జి సిడిపిఓ మేనేజ్ చేసుకున్నట్లు తెలిసింది. అదేవిధంగా మంథని ఇన్చార్జి సిడిపివోగా ఉన్న పుష్పలత అంగన్వాడి కేంద్రాలను తనిఖీలు చేస్తున్న సమయంలో అక్కడ ఉన్న సిబ్బంది పట్ల అమర్యాదగా మాట్లాడుతుందని ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాల తనిఖీకి వెళ్లిన సందర్భంలో సిడిపిఓ అక్కడ ఉన్న టీచర్ల పట్ల అమర్యాదగా మాట్లడుతుందని టీచర్లు ఆరోపిస్తున్నారు. టీచర్ల పట్ల అమర్యాదగా మాట్లాడిన ఇన్చార్జి సిడిపిఓ పైన కొంతమంది అంగన్వాడీ టీచర్లు సిబ్బంది ఏకంగా జిల్లా అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇన్చార్జి సిడిపిఓ మూలంగా తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని మంథని సిడిపిఓ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు లబ్ధిదారులు జిల్లా అధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ విషయంలో జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి మంథని సిడిపిఓ కార్యాలయానికి నూతన సిడిపిఓ ను నియమించి మంథని ప్రాజెక్టును సక్రమంగా నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సిడిపిఓ మూలంగా అంగన్వాడీ కేంద్రాలు అబాసు పాలవుతే రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కు ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుందని అందుచేత రెగ్యులర్ సిడిపిఓను వెంటనే మంథనిలో నియమించాలని పలువురు కోరుతున్నారు.

# ప్రజలలో భక్తిప్రభత్తులు పెరగడం శుభపరిణామం



## దైవచింతన మానసిక ప్రశాంతత ఆత్మస్థైర్యం కలిగిస్తుంది

## రావుల.చంద్రశేఖర్ రెడ్డి

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా :** ప్రజల్లో భక్తి పెరగడం శుభపరిణామం అని దైవచింతన మానసిక ఆనందాన్నిస్తుందని ఆదివారం రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పాతబజార్ 3వ వార్డ్ నందు శ్రీసీతరామలక్ష్మణ సహిత శ్రీ వీరాంజనేయ స్వామి ధ్వజస్థంభం, విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు స్వామిని దర్శించుకుకొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పున నిర్మాణం అద్భుతంగా జరిగిందని ఇందుకు కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినంది ంచారు.రోడ్ల విస్తరణ తర్వాత నూతనంగా రూపుదిద్దుకున్న ఆలయాలు,దర్గాలు,మసీదులు అద్భుతంగా ఉన్నాయని కృషి చేసిన నిరంజన్ రెడ్డి అభినందనీయులు అని అన్నారు. ఆలయం నిర్మించడంతో పాటు రోజు ధూపదీప నైవేద్యాలతో నిత్యం స్వామి వారిని పూజించాలని ఇందుక నా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు సాదరంగా రావుల చంద్రశేఖరరెడ్డి ని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన బొడ్రాయి శిలాకు పూజలు నిర్వహించారు. అయన వెంట జిల్లా మీడియా కన్వీనర్నందిమల్ల. అశోక్,గంధం.పరంజ్యోతి,బండారు.కృష్ణ,డాక్టర్. డ్యానియాల్, సూర్యవంశపుగిరి,సునీల్ వాల్మీకి, ఇమ్రాన్,మునికుమార్ మరియు ఆలయ కమిటీ సభ్యులు గోనూరు.వెంకటయ్య,వసంత శ్రీనివాసులు, నీల స్వామి,బాలస్వామి తదితరులు ఉన్నారు.

# ఉద్యమకారులకు ప్రశంస పత్రాలు అందజేత




**అగ్నిధార న్యూస్ మంథని :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ ఆదేశానుసారం మంథని మండలంలోని రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మంథని విద్యార్థి యువత కార్యాలయంలో ఉద్యమకారులకు తెలంగాణ రాష్ట్ర చరిత్ర పుస్తకం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఉద్యమ ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ గోగుల రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం దేవేందర్, రాష్ట్ర మహిళా నాయకురాలు అక్కపాక లక్ష్మి, మంథని మండల అధ్యక్షులు కాసిపేట సాంబయ్య, ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, నాయకులు మంథని సంపత్, కుడుదుల లక్ష్మి నారాయణ, రొడ్డ లింగయ్య, ముస్కె ఈశ్వరి, జీముడా కొండన్న, కండేలా సమ్మయ్య, తాటి బుచ్చయ్య గౌడ్, మిర్యాల రామ్ రెడ్డి, ముస్కుల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిర్విరామంగా కృషి చేయాలి





- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- గురుకులాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి
- గురుకులం లో మంజూరు చేసిన మరమ్మత్తు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి
- పిల్లలతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్
- మంథని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో రాత్రి బస

**అగ్నిధార న్యూస్ మంథని :** ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిర్విరామంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల , కళాశాల (బాలురు)లో నైట్ హాల్ట్ నిర్వహించారు. గురుకులంలో చదువుతున్న పిల్లలతో కలెక్టర్ (ముఖాముఖి) ఇంటరాక్ట్ అయ్యారు. గురుకులంలో అందిస్తున్న భోజనం నాణ్యత, విద్య, ఇతర వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్యా విధానం గురించి, విద్యార్థుల విజయం కోసం తయారు చేసినటువంటి పరీక్ష ప్రణాళిక విధానాన్ని తెలుసుకొని, విద్యార్థులకు పరీక్షలకు అనుకూలంగా తయారు చేసినటువంటి ప్రణాళికను పరిశీలించి, పరీక్షల సమయంలో ధైర్యంగా ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక గొప్ప లక్ష్యం ఉండాలని, దాని సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. మన లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో ప్రణాళిక తయారు చేసుకొని క్రమ పద్ధతిన ఆ దిశగా పయనించాలని, ఒకే రోజు అద్భుత ఫలితాలు సాధించడం కుదరదని, నిరంతర శ్రమ తోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటామని కలెక్టర్ తెలిపారు. గురుకులంలో మరమ్మత్తు పనుల మంజూరైన నిధులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ (భోజనం)డిన్నర్ చేసి, విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూ తూచ తప్పకుండా పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులతో కలిసి శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ హాస్టల్లోనే నిద్రించారు. అంతకు ముందు మంథని లోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి, డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉన్నారో లేదో తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన వివిధ పేషంట్లతో మాట్లాడారు వారి సమస్యలు, వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. వైద్యులు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని గురుకులం ప్రిన్సిపాల్ వి. శ్రీనాథ్, ఉపాధ్యాయ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నా కన్నతల్లి కాంగ్రెస్ పార్టీ... కాంగ్రెస్కు కాడెద్దులా పనిచేశా


## తప్పు చేస్తే నిరూపించు

## ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** కాంగ్రెస్ పార్టీ నా కన్నతల్లి అని గత 46 సంవత్సరాలుగా కాంగ్రెస్కు కాడి ఎద్దులా పనిచేస్తున్నానని సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లాలో మంత్రుల పర్యటనలో భాగంగా తప్పుడు శంకుస్థాపనలు చేస్తున్నారని చిన్నారెడ్డి నిరసన వ్యక్తం చేశారు నిరసన కారణంగా స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి చిన్నారెడ్డి పై పలు ఆరోపణలు చేశారు వాటిని ఖండిస్తూ ఆదివారము చిన్నారెడ్డి తన నివాసంలో పత్రికా సమావేశం నిర్వహించి తాను అనుభవపూర్వకంగా ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ఘనపూర్ లో గాని,గోపాల్పేట్ లో గాని,మార్కెట్ యార్డ్ మండల కేంద్రంలో ఉండాలని మండల కేంద్రాల్లో ఉండడం వల్ల రెవెన్యూ పెరుగుతుందని ఎమ్మెల్యే మెగా రెడ్డి కి అనుభవం లేకుండా కొంతమంది వ్యక్తుల కోసం పనిచేస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను గోపాల్పేటకు ఎడ్యుకేషన్ హబ్ తీసుకువచ్చానని, రామానంద తీర్థ ట్రేడింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్నామని వీటి వల్ల చాలామందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని ఆయన అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి అవగాహన రహిత్యంగా మంత్రులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని ప్రభుత్వం నుంచి అనుమతి ఉత్తరాలు వచ్చిన 10000 మెట్రిక్ టన్నుల గోదామును స్థల సేకరణ సరిగా చేయకుండా హడావిడిగా పెద్దమందడి మండలంలో ఉద్యానవన యూనివర్సిటీలో శిలాఫలకం వేయించారని, ఇలాంటి అవగాహన రాయిత్యం వల్ల కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు నష్టం జరుగుతుందని, గణపురం లో వచ్చిన మార్కెట్ యార్డ్ ను మండల హెడ్ క్వార్టర్ లో కాకుండా మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఘనపూర్ పట్టణవాసులు వ్యతిరేకించి ఆ శంకుస్థాపన అడ్డుకున్నారని, కానీ గోపాల్పేట్ మండలంలో పట్టణంలోని ప్రజలకు అవగాహన రాయిత్యం వల్ల అడ్డుకోలేకపోయారని, గోపాల్పేట నా సొంత మండలం కాబట్టి నేను తప్పక నిరసన వ్యక్తం చేయవలసి వచ్చిందని వ్యక్తిగత ప్రయోజనాలు కావని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, నేను ఇలాంటి వ్యక్తిని ప్రజలకు తెలుసని, ఎమ్మెల్యే మెగా రెడ్డిగురించి తెలుగుదేశం పార్టీలో రావుల చంద్రశేఖర్ రెడ్డిని టిఆర్ఎస్ పార్టీలో నిరంజన్ రెడ్డిని అడుగుతే ఆయన భాగవతం తెలుస్తుందని ఆయన వ్యంగంగా అన్నారు. నియోజకవర్గం లో జరుగుతున్న విషయాలను కాంగ్రెస్ హై కామాండ్కు పి ఎస్ సి కమిటీకి తెలియజేశారని అన్నారు. ఆనాడు ఎన్నికల్లో టికెట్ నన్ను కాదని టికెట్ తెచ్చుకున్నప్పటికీ ఒక క్రమశిక్షణ గల నాయకుడిగా 50 వేలకు పైగా సభ్యత్వాలు కాంగ్రెస్ పార్టీలో చేయించి 175 కిలోమీటర్ల పాదయాత్ర చేసి, ప్రతి గడపకు కాంగ్రెస్ నినాదంతో మేఘారెడ్డిని గెలిపించాను అని ఆయన అన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకపోలేని మీరా నేనా అని ఆయన పత్రికా ముఖంగా ప్రశ్నించారు, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ 21 కోట్ల రుణమాఫీ చేసిందని, 54 కోట్ల వ్యవసాయ సహాయం అందించిందని 53,000 ఉద్యోగాలు, వీటిని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేస్తామని అని అన్నారు. నా చిరకాల ప్రత్యర్థి నిరంజన్ రెడ్డికి నేను సహాయం చేస్తున్నాను అని ఆరోపించడం విడ్డూరమని నిరంజన్ రెడ్డి ఒక అహంకారి అవినీతిపరుడని అలాంటి వ్యక్తులతో నేను స్నేహం చేయనని, కేవలం నిరంజన్ రెడ్డి గతంలో చేసిన అభివృద్ధి పనులను కొనసాగించుట కోసం మాత్రమే నేను ఒకటి రెండు సార్లు తనతో మాట్లాడాలని, ఆయన చేసిన సమీకృత మార్కెట్ యార్డ్ కానీ ఐటీ టవర్ కానీ ఇవి ప్రజల అవసరాలకు ఉపయోగపడతాయని వాటిని కొనసాగించడానికి నేను ప్రయత్నం చేస్తున్నాను, దీనికి అర్థం చేసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని ఆయన అన్నారు. ఇలాంటి అవగాహన రాయిత్యం వల్లనే రేవంత్ రెడ్డి ఏరి కోరి తెచ్చుకున్న మన్య జీవన్ రెడ్డిని ఎమ్మెల్సీగాగెలిపించుకోలేకపోయామని తాను ఎన్ని ప్రయత్నాలు చేసినా మాట వినకుండా జీవన్ రెడ్డి ఓటమికి మెగా రెడ్డి కారణమని ఆయన ఆరోపించారు.

# మంచిర్యాల జిల్లాకు ముఖ్యమంత్రి రాక..



**అగ్ని ధార న్యూస్, మందమర్రి ఫిబ్రవరి 23. :** పట్టణంలోని.. పట్టభద్రులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్మంచిర్యాలకు జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక సందర్భంగా..ఉమ్మడి ఆదిలాబాద్– మెదక్– నిజామాబాద్– కరీంనగర్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి,ఎన్నికల ప్రచారంలో భాగంగా, తేదీ: 24 ఫిబ్రవరి సోమవారం రోజున, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో.. మంచిర్యాల జిల్లా, కలెక్టర్ కార్యాలయం ఆవరణలో .. చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి రేపు నిర్వహించే పట్టభద్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇతర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు ముఖ్యఅతిథిగా.. హాజరవుతారు. కావున మందమర్రి పట్టణంలోని పట్టభద్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని, మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ పిలుపునివ్వడం జరిగింది.

# వన్ ఇంక్లైన్ మోరి వద్ద చెత్త కుప్పలను తొలగించండి.



## సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్.

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు కు ఇరు వైపుల చెత్త కుప్పలు ఉన్నాయని, వాటిని తొలగించె విధంగా ఆర్జీ వన్ యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో అధికారులను కోరారు. గత కొన్ని నెలలుగా ఇక్కడ డంప్ చేసిన చెత్త కుప్పలను తొలగించడం లేదని, అదేవిధంగా చికెన్ వ్యర్థాలు ఇట్టి చెత్త కుప్పల పై పోయడం వల్ల ఈ రోడ్డు మీదుగా వెళ్లే వాహన దారులు, ప్రజలు దుర్వాసనతో తో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సింగరేణి ఆర్జీ వన్ అధికారులు స్పందించి వన్ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు ప్రక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటన లో కోరారు.

